


దిన పత్రిక

# తొలి సమయం

వాస్తవమే గమ్యం.. గమనం...

సంపుటి : 02 సంచిక : 156 ఆదివారం 8-06-2025 ఎడిటర్ : వేముల అయోధ్య రాములు పేజీలు : 4 వెల : 5 రూ/..

## ఓఆర్ఆర్ లోపల 65వేల ఆటోలకు అనుమతి

**విద్యుత్, ఎల్పీజీ, సీఎన్‌జీ ఆటోలకు మాత్రమే**

**65వేల కుటుంబాలకు ఉపాధి: మంత్రి పొన్నం**

**హైదరాబాద్, జూన్ 7:** ఔటర్ రింగు రోడ్డు (ఓఆర్ఆర్)లోపల కొత్తగా 65 వేల ఆటోలకు ప్రభుత్వం అనుమతించింది. హైదరాబాద్‌లో పెరుగుతున్న జనాభాకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు మేరకు ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్‌రాజ్ జీవో ఆర్టీ నంబర్ 263 జారీ చేశారు. కాలుష్య నియంత్రణలో భాగంగా అమల్లో ఉన్న నిబంధనల మేరకు హైదరాబాద్‌లో కొత్త ఆటోలకు పర్మిట్లు ఇచ్చేందుకు వీలు లేదు. 2002 నుంచి ఈ నిబంధన అమలవుతుండగా, తెలంగాణ ఏర్పాటు తర్వాత అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం కొత్తగా 20వేల ఆటోలకు మాత్రమే పర్మిట్లు ఇచ్చింది. అయితే, ప్రస్తుతం అమల్లో ఉన్న నిబంధనలను సడలిస్తూ ఓఆర్ఆర్ లోపల పరిమిత సంఖ్యలో విద్యుత్, సీఎన్‌జీ, ఎల్పీజీ ఆటోలకు ప్రభుత్వం అనుమతించింది. 20 వేల విద్యుత్ ఆటోలు, 10వేల ఎల్పీజీ ఆటోలు, 10వేల సీఎన్‌జీ ఆటోలు, 25వేల డీజిల్, పెట్రోల్ ఇంజన్లతో ఉన్న (రెట్రో ఫిట్మెంట్ విధానంలో విద్యుత్, సీఎన్‌జీ, ఎల్పీజీగా మార్చేందుకు వీలైన) ఆటోలకు అనుమతులు ఇచ్చేందుకు సర్కారు ఓకే చెప్పింది. కాగా, ఓఆర్ఆర్ లోపల జనాభా పెరుగుదలను దృష్టిలో పెట్టుకొని సీఎం రేవంత్‌రెడ్డి ఈ నిర్ణయం తీసుకున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ప్రభుత్వ నిర్ణయంతో 65 వేల కుటుంబాలకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఒక ప్రకటనలో వివరించారు.

## కమిషన్ అడిగిన ప్రశ్నలకు ఈటల పొంతనలేని సమాధానం

**ఈటలపై తుమ్మల ఫైర్**



**హైదరాబాద్:** బీజేపీ నేత, హైదరాబాద్-మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ వ్యాఖ్యలను తెలంగాణ వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తప్పుబట్టారు. కాళేశ్వరం కమిషన్‌కు ఈటల అసత్యాల వాంగ్మూలం ఇచ్చారని మంత్రి తుమ్మల ఆగ్రహించారు. కమిషన్ అడిగిన ప్రశ్నలకు ఈటల పొంతనలేని సమాధానం ఇచ్చారని, ఆయన చెప్పిన సబ్ కమిటీ.. కాళేశ్వరం కోసం వేసింది కాదన్నారు. కాళేశ్వరానికి శాంక్షన్ ఇచ్చిన తర్వాత పెండింగ్ ప్రాజెక్టుల కోసం వేసిన సబ్ కమిటీ అదని తుమ్మల క్లారిటీ ఇచ్చే ప్రయత్నం చేశారు. ప్రాణహిత, దేవాదుల, కాంతలపల్లి, తుపాకులగూడెం పనుల కోసం సబ్ కమిటీ వేశారని బీఆర్ఎస్ పాలనా సమయంలో జరిగిన విషయాల్ని మంత్రి తుమ్మల గుర్తు చేశారు. ఆ సబ్ కమిటీ కాళేశ్వరం బ్యారేజీలపై ఎలాంటి నివేదిక ఇవ్వలేదని.. కాళేశ్వరం నిర్మాణానికి సబ్ కమిటీ ఆమోదం తెలిపిందనడం అబద్ధమని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టు కేబినెట్ ఆమోదం పొందలేదని మంత్రి తుమ్మల తేల్చిచెప్పారు. 'కాళేశ్వరం ఎప్పుడూ కేబినెట్ ముందుకు రాలేదు. పరిపాలన అనుమతులతోనే కాళేశ్వరం అమలులోకి వచ్చింది. ఈటెల రాజేందర్ ప్రజలకు తప్పుడు సమాచారం ఇచ్చారు. కమిషన్ ముందు ఈటలకు అబద్ధాలు ఆడాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చింది. ఈటల పట్ల గౌరవం ఉంది, కానీ ఆయన ప్రకటన చూసిన తర్వాత కొంత బాధేసింది. నేను స్వయంగా కమిషన్‌కు సబ్ కమిటీ రిపోర్ట్‌ను ఇవ్వాలని అనుకుంటున్నా. కమిషన్ వివాదంలోకి నన్ను ఎందుకు లాగాల్సి వచ్చిందో ఈటలే సమాధానం చెప్పాలి. తుమ్మల కూడా కాళేశ్వరం కోసం సబ్ కమిటీ రిపోర్ట్ పై సంతకం చేశారని ఇచ్చిన వాగ్మూలం బాధాకరం. కాళేశ్వరం అంశం కేబినెట్ ఉమ్మడి నిర్ణయమని చెప్పడం సరికాదు. హరీష్ రావు అబద్దాల హరీష్ రావుగా మారిపోయారని' మంత్రి తుమ్మల అన్నారు. కాళేశ్వరం కేబినెట్ ముందుకు వచ్చినట్లు రుజువు చూపించాలని ఈటలను తుమ్మల డిమాండ్ చేశారు. కాగా, తుమ్మల గతంలో బీఆర్ఎస్ పార్టీలో ఉండే వారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీలోకి చేరి ప్రస్తుతం మంత్రిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.




## తెలంగాణ కేబినెట్ విస్తరణకు ముహూర్తం ఫిక్స్

**హైదరాబాద్, జూన్ 7:**
గత కొన్ని నెలలుగా తెలంగాణ మంత్రివర్గ విస్తరణపై కొనసాగుతున్న ఊహాగానాలకు తెరపడింది. ఎట్టకేలకు మంత్రివర్గ విస్తరణకు కాంగ్రెస్ హైకమాండ్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రేపు (ఆదివారం) తెలంగాణ కేబినెట్ విస్తరణ జరుగనుంది. మంత్రివర్గంలో కొత్తగా ముగ్గురికి చోటు దక్కనున్నట్లు తెలుస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు ఇప్పటి వరకు 12 మంది కేబినెట్‌లో మంత్రులుగా ఉన్నారు. మరో ఆరు స్థానాలను భర్తీ చేయాల్సి ఉంది. అయితే ఏడాదిన్నరకు పైగా కేబినెట్ విస్తరణ జరగలేదు. దీంతో కాంగ్రెస్ పార్టీలో ఆశావాహుల సంఖ్య పెరిగింది. తమకు అవకాశం ఇవ్వాలంటూ అధిష్టానం చుట్టూ నేతలు తిరుగుతున్న పరిస్థితి. ఇటీవల మీనాక్షీ నటరాజన్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జ్‌గా నియమితులైన తర్వాత ఆశావాహులంతా కూడా ఆమె కలిసి మంత్రి పదవి కోసం వినతులు చేశారు. కొత్తగా ఎన్నికైన నేతలు, సీనియర్ నేతలు తమకు అవకాశం కల్పించాల్సిందిగా సీఎం రేవంత్ రెడ్డితో పాటు, ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ పెద్దలను కలుస్తున్నారు.

ఈ క్రమంలో మంత్రి వర్గ విస్తరణపై కాంగ్రెస్ హైకమాండ్ సంకేతాలు ఇచ్చింది. రేపు మంత్రి వర్గ విస్తరణ ఉండే అవకాశాలు కన్పిస్తున్నాయి. దీనిపై ఈరోజు రాజ్‌భవన్ నుంచి అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది. మంత్రి వర్గ విస్తరణకు సంబంధించి ఏర్పాట్లు చేయాల్సిందిగా రాజ్‌భవన్ వర్గాలను సీఎం కోరినట్లు తెలుస్తోంది. రేపు కేబినెట్ విస్తరణలో ముగ్గురికి చోటు దక్కే అవకాశం ఉంది. అయితే ఈ ముగ్గురు ఎవరనే దానిపై ఉత్కంఠ నెలకొంది. మంత్రి వర్గంలో చోటు దక్కించుకునేందుకు అనేక మంది పోటీ పడుతున్నారు. ఎస్సీ సామాజిక వర్గం నేతలు, రెడ్డి సామాజిక వర్గం నేతలు మంత్రి వర్గంలో స్థానం కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటి వరకు ఎస్సీ సామాజికవర్గానికి కేబినెట్‌లో ప్రాధాన్యత లేదు. ముదిరాజ్‌లకు కచ్చితంగా అవకాశం ఇస్తానని గత ఎన్నికల సమయంలో సీఎం రేవంత్ హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. అంతేకాకుండా మైనార్టీలకు కూడా కేబినెట్‌లో చోటు లభించలేదు. ఈ క్రమంలో రేపటి కేబినెట్ విస్తరణలో బీసీ, ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాలకు చెందిన ఎమ్మెల్యేలకు చోటు లభించే ఛాన్స్ ఉన్నట్లు తెలుస్తోంది.

## ఛత్తీస్‌గడ్‌లో భారీ ఎన్‌కౌంటర్..

**కీలక మావో నేతల మృతి**



**ఛత్తీస్‌గడ్:** ఛత్తీస్‌గడ్‌లో భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. శనివారం భద్రతా బలగాలు, మావోయిస్టులకు మధ్య పోటాపోటీగా కాల్పులు జరిగాయి. ఈ కాల్పుల్లో ఇద్దరు మావోయిస్ట్‌లు హతమయ్యారు. బీజాపూర్ నేషనల్ పార్క్ సమీపంలో ఎదురు కాల్పులు జరిగాయి. భద్రతా బలగాలు చేపట్టిన సెర్చ్ ఆపరేషన్ మూడో రోజు కూడా కొనసాగుతోంది. మొన్న కేంద్ర కమిటీ సభ్యుడు లక్ష్మీనరసింహం, నిన్న భాస్కర్ ఎన్‌కౌంటర్‌లో హతమైన విషయం తెలిసిందే. ఇవాళ మూడో రోజు ఇద్దరు కీలక నేతలు మృతిచెందారు. భద్రతా బలగాల సెర్చ్ ఆపరేషన్ ఇంకా కొనసాగుతోంది. కాగా, కేంద్రప్రభుత్వం ఆపరేషన్ కగార్‌తో మావోలను ఎక్కడికక్కడ అడ్డుకుంటుంది. ఇందులో భాగంగానే గతకొన్ని రోజులుగా మావోయిస్ట్‌లపై భద్రతా బలగాలు చర్యలు తీసుకుంటున్నాయి. మావోలపై భద్రతా బలగాలు జరిపిన ఎన్‌కౌంటర్‌లలో పలువురు అగ్రనేతలు మృతిచెందారు. తాజాగా బీజాపూర్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లోనూ ఇద్దరు కీలక నేతలు మృతిచెందారు. వరుసగా మావోలకు ఎదురు దెబ్బలు తగులుతుండటంతో ప్రభావం కోల్పోతున్నారు. ఇదిలా ఉండగా.. మావోయిస్టులతో చర్చలు జరపాలని కేంద్ర ప్రభుత్వాన్ని పౌర హక్కుల సంఘాల నేతలు డిమాండ్ చేస్తున్నారు. మావోలతో చర్చలపై ఇంతవరకు కేంద్ర ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు.

## రాహుల్ వర్సెస్ ఈసీ

**రాహుల్ గాంధీ ఆగ్రహం వ్యక్తం చేసిన ఈసీ**

**వెనక్కి తగ్గని రాహుల్.. ఈసీ ముందు రెండు డిమాండ్లు**



**న్యూఢిల్లీ, జూన్ 7 :** మహారాష్ట్రలో గతేడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మ్యాచ్ ఫిక్సింగ్ జరిగిందంటూ రాహుల్ గాంధీ (%=ఖుష్ట్రబశ్రీ +ఖుఅస్త్రఱ%) శనివారం నాడు సంచలన ఆరోపణలు చేశారు. అయితే ఆయన ఆరోపణలు నిరాధారమని ఎన్నికల కమిషన్ కొట్టిపారేసింది. ఈసీ స్పందించిన కొద్దిసేపటికే తిరిగి రాహుల్ స్పందించారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించిన కీలక డేటాను బహిరంగం చేయాలని ఈసీని డిమాండ్ చేశారు. తీవ్రమైన అంశాలపై ఎగవేత ధోరణిలో ఈసీ స్పందించిందని, కమిషన్ తన విశ్వసనీయతను పునరుద్ధరించుకునేందుకు తగిన చర్యలు తీసుకోవాలని అన్నారు. "మీది రాజ్యాంగ బద్ధమైన వ్యవస్థ. సంతకం లేకుండా, మధ్యవర్తులతో ఎగవేత ధోరణిలో స్పందించడం సరైన పద్ధతి కాదు" అని రాహుల్ ట్వీట్‌లో పేర్కొన్నారు. మహారాష్ట్రతో సహా ఇటీవల అన్ని రాష్ట్రాల్లో జరిగిన లోక్‌సభ, విధానసభల సమగ్రమైన డిజిటల్, మెషీన్-రీడబుల్ ఓటర్ల జాబితాను ప్రచురించాలని, మహారాష్ట్ర పోలింగ్ బూత్‌లతో సాయంత్రం 5 గంటల తర్వాత సీసీటీవీ ఫుటేజ్‌ను విడుదల చేయాలని రాహుల్ డిమాండ్ చేశారు. దీనికి ముందు రాహుల్ గాంధీ తన ట్వీట్‌లో.. 2024 అసెంబ్లీ ఎన్నికల్లో రిగ్గింగ్ జరిగిందని ఆరోపించారు. ఎన్నికల కమిషన్ నియామకం కోసం ప్యానల్ రిగ్గింగ్‌తో ప్రారంభించి అవకతవకల సాక్ష్యాలను దాచిపెట్టడంతో ఐదంచెల్లో మ్యాచ్ ఫిక్సింగ్ వ్యూహాన్ని బీజేపీ మహరాష్ట్రలో అనుసరించిందని అన్నారు. వంచనకు పాల్పడిన వారు గెలవచ్చేమో కానీ ఇలాంటి పద్ధతుల వల్ల ప్రజాస్వామ్యం బలహీనపడి, వ్యవస్థలపై ప్రజలకు విశ్వాసం పోతుందని చెప్పారు. త్వరలో జరుగనున్న బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లోనూ మ్యాచ్ ఫిక్సింగ్‌కు బీజేపీ పాల్పడనుందన్నారు. దీనిపై ఎన్నికల కమిషన్ ఘాటుగా స్పందించింది. రాహుల్ వ్యాఖ్యలు అసంబద్ధమని, తప్పుదారి పట్టించేలా ఉన్నాయని ఓ ప్రకటనలో ఆక్షేపించింది. ఎన్నికల కమిషన్ డిసెంబర్ 2024న ఇందుకు సంబంధించిన వాస్తవాలను ఇండియన్ నేషనల్ కాంగ్రెస్‌కు తెలియజేసిందని, దానిని ఈసీఐ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచిందని తెలిపింది. సాక్ష్యాలు లేకుండా పదేపదే ఎవరు ఆరోపణలు చేసినా వారికి చట్టం పట్ల గౌరవం లేదనే అభిప్రా యానికి తావిస్తుందని, నిష్పాక్షిక ఎన్నికల కోసం అవిశ్రాంతంగా కృషి చేస్తున్న ఎన్నికల సిబ్బంది నైతిక స్థైర్యాన్ని దెబ్బతీస్తుందని ఘాటుగా విమర్శించింది. కాగా, ఈసీ సమాధానం ఇచ్చిన కొద్దిసేపటికే రాహుల్ తిరిగి స్పందించారు. ఈసీ ముందు రెండు డిమాండ్లు ఉంచారు. తమ డిమాండ్లను నెరవేర్చడం ద్వారా ఈసీ తన విశ్వసనీయతను నిరూపించు కోవాలన్నారు.

## రాష్ట్రానికి కల్పతరువు కాళేశ్వరం..

**సూర్యాపేట, కోదాడ దాకా నీరు అందించాం: హరీశ్ రావు**



**హైదరాబాద్,జూన్ 7:** కాళేశ్వరం ప్రాజెక్టు రాష్ట్రానికి కల్పతరువని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా మొత్తం 20 లక్షల 33 వేల 572 ఎకరాలకు సాగునీరు అందిస్తే, ఒక్క ఎకరాకు నీళ్లు ఇవ్వలేదని కాంగ్రెస్ నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. ఒక ఏడాది కరువు వస్తే, ఎస్సారెస్పీకి కూడా నీళ్లను రివర్స్ పంపింగ్ చేశామన్నారు. తెలంగాణ భవన్‌లో కాళేశ్వరం ప్రాజెక్టుపై హరీశ్ రావు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మిడ్ మానేర్ నుంచి ఎల్ఎండీకి నీళ్లు తెచ్చి, అక్కడి నుంచి ఎస్సారెస్పీ స్టేజ్ 1కు నీళ్లిచ్చామన్నారు. ఎస్సారెస్పీ స్టేజ్ 2లో తుంగతుర్తి, సూర్యాపేట, కోదాడ దాకా నీరు అందించామని చెప్పారు. కేసీఆర్ ప్రభుత్వం కాళేశ్వరం నీళ్లు పంపించి పంటలు కాపాడిందని తెలిపారు. ఇది వాస్తవమైన రిపోర్టు అని, నీటి పారుదలశాఖ అధికారులిస్తున్న నివేదిక అని వెల్లడించారు. కానీ కాంగ్రెస్ నాయకులు 50 వేల ఎకరాలే పారిందని దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు 'తెలంగాణ ఏర్పడక ముందు గోదావరి జలాల సద్వినియోగానికి ఎవరూ కృషి చేయలేదు. 2007 నుంచి 2014 వరకు కేంద్రంలో, మహారాష్ట్రలో, ఏపీలో కాంగ్రెస్ ప్రభుత్వాలే ఉన్నప్పటికీ తుమ్మడి హట్టి వద్ద ప్రాజెక్టు నిర్మాణం కోసం కేంద్రం నుంచి ఏ అనుమతి సాధించలేదు. బీఆర్ఎస్ పార్టీలో ఆలోచన చేసినం, తెలంగాణ పచ్చబడాలంటే గోదావరి జలాలే కావాలనుకున్నం. గోదావరి నది 1465 కిలోమీటర్లు ప్రవహిస్తుంటే, అందులో 750 కిలోమీటర్లు తెలంగాణలోనే ప్రవహిస్తున్నది. ఉమ్మడి ఏపీ రాష్ట్రంలో 1480 టీఎంసీల కేటాయింపులుంటే, తెలంగాణ వాటా 969 టీఎంసీలు. కానీ, వాస్తవంగా అందులో తెలంగాణ వాడకం ఏనాడూ 400 టీఎంసీలు మించలేదు. 2014 వరకు తెలంగాణలో గోదావరిపై కట్టిన ప్రాజెక్టులు ఎస్సారెస్పీ, దేవాదుల మాత్రమే. తెలంగాణ ఉద్యమం ఉప్పెనలా వస్తే, తలొగ్గిన కాంగ్రెస్ ప్రభుత్వం.. తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహిత -చేవెళ్ల ప్రాజెక్టుకు రూపకల్పన చేసింది. అక్కడ నీటి లభ్యత ఉండదు. ప్రాణహిత-చేవెళ్ల నీటి నిల్వ సామర్థ్యం కేవలం 11 టీఎంసీలు మాత్రమే. కాళేశ్వరం ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 141 టీఎంసీలు.. రెండింటి మధ్య ఎంత తేడా.. 2014 వరకు కాంగ్రెస్ నాయకులు సర్వే, మొబిలైజేషన్ అడ్వాన్సుల కింద రూ.2328 కోట్లు కాంట్రాక్టర్లకు ఇస్తే, పనులు జరగనేలేదు. ఇందులో తట్టెడు మట్టి కూడా ఎత్తకుండా మొబిలైజేషన్ అడ్వాన్సుల పేరిట రూ.1052 కోట్లు కాంగ్రెస్ ప్రభుత్వం స్వాహా చేసిందని స్వయంగా కాగ్ తన రిపోర్టులో వెల్లడించింది. ఇట్లా ఆ పైసలు కాంగ్రెస్ నాయకులు తీసుకొని జేబులు నింపుకున్నరు. అప్పుడు మంత్రులుగా ఉన్నది కూడా ఇదే కోమటిరెడ్డి, ఉత్తమ్, శ్రీధర్ బాబులే. ఆనాడు రేవంత్ రెడ్డి తెలుగుదేశం పార్టీలో ఉండి విమర్శించిండు. జలయజ్ఞం కాదు.. ధనం యజ్ఞం అన్నడు. కానీ ఈరోజు రేవంత్ రెడ్డే కాంగ్రెస్ అవినీతిని వెనకేసుకొస్తున్నడు. ఈ మధ్య ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడిండు. ప్రాణహిత చేవెళ్ల కోసం మేం రూ.10 వేల కోట్లు ఖర్చు పెట్టినం, ఇంకో రూ.20 వేల కోట్లు పెడితే అయిపోతుండె అన్నడు. నేను లెక్కలన్నీ తీయిస్తే కాంగ్రెస్ ఖర్చు చేసింది రూ.3700 కోట్లు మాత్రమేనని తేలింది. ఎందుకీ గోబెల్స్ ప్రచారం?. ప్రాజెక్టు ఖర్చు పెరిగిందని దుష్ప్రచారం చేస్తున్నరు ఈ కాంగ్రెస్ నాయకులు. 2007లో రూ.17,875 కోట్లకు జీవో ఇచ్చి, ఏ పని చేయకుండానే ప్రాజెక్టు ఖర్చును రూ.38,500 కోట్లకు పెంచింది కూడా వీళ్లే. ఆ తర్వాత కేంద్రానికి పంపినపుడు రూ.40,300 కోట్లకు పెంచారు ఇదే కాంగ్రెస్ నాయకులు. ఇదీ వీళ్ల నిర్వాకం.' అని హరీశ్‌రావు అన్నారు. కాళేశ్వరం కమిషన్ ముందు విచారణకు వెళ్తామని హరీశ్ రావు చెప్పారు. ఇక్కడ ఎవరూ భయపడడం లేదని తెలిపారు. తమకేం భయం లేదని, బాజాప్తా విచారణకు హాజరవుతామని స్పష్టం చేశారు.

## కాళేశ్వరం కమిషన్ పేరిట నాటకాలాడుతున్నారు : కేటీఆర్

**హైదరాబాద్:** కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్, బీజేపీ నేతలు దుష్ప్రచారం చేస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇవాళ(శనివారం) తెలంగాణ భవన్‌లో కాళేశ్వరం ప్రాజెక్టుపై మాజీమంత్రి హరీష్‌రావు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చారు. ఈ ప్రెజెంటేషన్ అనంతరం మీడియాతో కేటీఆర్ మాట్లాడారు. తన విజ్ఞప్తి మేరకు హరీష్‌రావు కాళేశ్వరం ప్రాజెక్టుపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చారని తెలిపారు. నీళ్లు, నిధులు, నియామకాల కోసం తెలంగాణ ఉద్యమం చేశామని తెలిపారు. నీళ్ల విషయంలో దశాబ్దాలుగా తెలంగాణకు అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పాలనలో అన్నీ దందాలు.. చందాలేనని షాకింగ్ కామెంట్స్ చేశారు మాజీ మంత్రి కేటీఆర్. ఎన్డీఎస్ఏ రిపోర్ట్ తప్పని.. బీజేపీ, కాంగ్రెస్ కార్యాలయాలు కట్టిన సంస్థ చెప్పిందని మాజీ మంత్రి కేటీఆర్ గుర్తుచేశారు. సుంకిశాల, ఎస్ఎల్‌బీసీ టన్నెల్ కూలి ఎనిమిది మంది కార్మికులు చనిపోతే సీఎం రేవంత్‌రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి ఎందుకు మాట్లాడరని నిలదీశారు. కాళేశ్వరం విషయంలో మాత్రం అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. 371పిల్లర్లలో రెండు మాత్రమే కుంగాయని అన్నారు. తెలంగాణ నుంచి పంపిన మూటలతోనే ఢిల్లీలో కాంగ్రెస్ కార్యాలయం కట్టారని ఆరోపించారు. మేడిగడ్డ బ్యారేజ్ రెండు పిల్లర్లలో మాత్రమే పగుళ్లు వస్తే.. ప్రాజెక్టు మొత్తం కూలిపోయిందన్నట్లుగా కాంగ్రెస్ నేతలు, మంత్రులు దుష్ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. కాంగ్రెస్, బీజేపీ కుమ్మక్కై కేసీఆర్‌పై అభాండాలు వేస్తున్నారని ఆరోపించారు. కాళేశ్వరం కమిషన్ పేరిట రేవంత్ ప్రభుత్వం నాటకాలాడుతోందని మండిపడ్డారు. మేడిగడ్డ బ్యారేజ్‌కు వెంటనే రిపేర్లు చేసి నీళ్లివ్వాలని తాము గతంలో కోరినా కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు పట్టించుకోలేదని కేటీఆర్ ప్రశ్నల వర్షం కురిపించారు.



# తొర్రూరు ఈద్గాలో బక్రీద్ నమాజులు చేస్తున్న ముస్లింలు





తొలి సమయం తొర్రూరు జూన్ 7 బక్రీద్ పండుగ పురస్కరించుకొని త్వరలో మండలంలోని ఈద్గాలో చుట్టూ ఉన్న గ్రామ ముస్లిం సోదరులందరూ కలిసి వీటిలో నమాజులు చేసినారు

బక్రీద్ పండగను ఎందుకు జరుపుకుంటారు..?

హజ్ యాత్రకొరకు అరబ్ దేశమైన సౌదీ అరేబియాలోని మక్కా నగరానికి చేరుకుని మసీద్ లో ఉన్న కాబా చుట్టూ ఏడు ప్రదక్షిణలు చేసి అక్కడ ప్రార్థనలు చేస్తారు. ఈ మసీద్ కాబా గృహం చుట్టూ ఉంది. ప్రపంచంలోని ముస్లింలందరూ కాబా వైపు తిరిగి నమాజ్ ( ప్రార్థనలు ) చేస్తారు. దీనినే ఖిబ్లా అని కూడా అంటారు.హజ్ తీర్థయాత్రకు వెళ్ళినవారు మక్కా నుండి మదీనా ( ముహమ్మద్ ప్రవక్త గోరీ ఉన్ననగరం )ను సందర్శిస్తారు. అల్లాహ్ ఆదేశానుసారం ఇబ్రహీం తన ఏకైక పుత్రుడైన ఇస్మాయిల్‌ను బలి ఇవ్వడానికి సిద్ధమౌతాడు. ఆ సంప్రదాయాన్ని స్మరిస్తూ ముస్లింలు ఈ బక్రీద్ పండుగను జరుపుకుంటారు.

**హిజ్రీ అంటే ఏమిటి..**

బక్రీద్ అంటే బకర్ ఈద్ అని అర్థం. బకర్ అంటే జంతువని, ఈద్ అంటే పండుగని అర్థాలు ఉన్నాయి. జంతువును ఖుర్బాని ( దానం ) ఇచ్చే పండుగ కాబట్టి దీనిని ఈదుల్ ఖుర్బాని అని కూడా అంటారు. మహ్మదీయులు సంవత్సరాన్ని హిజ్రీ అనే పేరుతో పిలుసుకుంటారు. హిజ్రీ అంటే వలసపోవడం అని అర్థం. మహ్మద్ ప్రవక్త మక్కా నుండి మదీనాకు తరలివెళ్లడాన్ని హిజ్రీగా పేర్కొంటారు. ప్రతి ముస్లిం తన జీవిత కాలంలో ఒక్కసారైనా హజ్ యాత్ర చేయాలన్నది ఇస్లాం మత సూత్రాలలో ఇదొకటి. త్యాగనిరతితోపాటు మనోవాంఛ, స్వార్థం, అసూయ, రాగద్వేషాలను కూడా విడిచిపెట్టి మానవతను వెదజల్లాలన్నదే బక్రీద్ పండుగలోని ప్రధాన పరమార్థం దాగిఉంది.

**ఖురాన్ ఏం చెబుతోంది..**

ఖురాన్ ప్రకారం.. భూమిపైకి అల్లాహ్ పంపిన ప్రవక్తల్లో ఇబ్రహీం ఒకరు. ఆయన మక్కా పట్టణాన్ని నిర్మించి నివాస యోగ్యంగా మార్చారు. అల్లా ఆరాధన కోసం కాబా అనే ప్రార్థనా మందిరాన్ని కూడా నిర్మించి దైవ ప్రవక్తగా ఆయన పేరుపొందాడు. ఇబ్రహీం తనకు లేకలేక పుట్టిన బిడ్డకు ఇస్మాయిల్ అని పేరు పెట్టాడు. ఓ రోజు ఇస్మాయిల్ మెడపై కత్తిపెట్టి కోస్తున్నట్టు ఇబ్రహీం కలగన్నాడు. అల్లాహ్ ఖుర్బాని కోరుతున్నాడమోనని ఓ ఒంటెను బలిస్తాడు. అయినా, మళ్లీ అదే కల రావడంతో తన కుమారుడినే బలిదానం కోరుకుంటున్నారని భావించిన ఇస్మాయిల్ సిద్ధపడ్డాడు. ఇస్మాయిల్ మెడపై కత్తి పెట్టి జుబాహ్‌కు ఇబ్రహీం ఉద్యుక్తుడవుతుండగా అతని త్యాగానికి మెచ్చిన అల్లాహ్ దీనికి బదులుగా ఓ జీవాన్ని బలివ్వాలని జిబ్రాయిల్ అనే దూత ద్వారా కోరతాడు. అప్పటి నుంచే బక్రీద్ రోజున ఖుర్బాని ఇవ్వడం ఆనవాయితీగా వస్తుందని ముస్లిం భావిస్తున్నారు.

## బక్రీద్ శుభాకాంక్షలు తెలిపిన- బి ఆర్ఎస్ పార్టీ మాజీ జిల్లా అధ్యక్షులు దిండిగాల రాజేందర్



**తొలిసమయం, ఇల్లందు.జూన్, 07.** ఈరోజు బక్రీద్ పండుగ సందర్భాన్ని పురస్కరించుకొని ఇల్లందు నియోజకవర్గ ముస్లిం సోదర సోదరీమణులకు భారత రాష్ట్ర సమితి మాజీ జిల్లా అధ్యక్షులు దిండిగాల రాజేందర్ శుభాకాంక్షలు తెలిపారు. బక్రీద్ పర్వదిన సందర్భంగా ముస్లిం సోదరులు సామూహికంగా మత ప్రార్థనలు నిర్వహించే ఈద్గా వద్దకు భారత రాష్ట్ర సమితి పార్టీ శ్రేణులతో కలిసి వెళ్లి ముస్లిం సోదరులకు ఆత్మీయ ఆలింగనం అందించి బక్రీద్ పర్వదిన శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా మాజీ జిల్లా అధ్యక్షులు దిండిగాల రాజేందర్ మాట్లాడుతూ త్యాగం, సహనం ఈ రెండు బక్రీద్ పండుగ ఇచ్చే సందేశాలని అన్నారు. దైవ ప్రవక్త ఇబ్రహీం మహోన్నత త్యాగాన్ని స్మరించుకుంటూ బక్రీద్ పండగ జరుపుకుంటారని, త్యాగనిరతికి బక్రీద్ పండగ నిదర్శనం అనే అన్నారు ధనిక, పేద అనే భేదం లేకుండా రాగద్వేషాలకు అతీతంగా ముస్లిం సోదర సోదరీమణు లందరు అత్యంత భక్తిశ్రద్ధలతో చేసుకునే పర్వదినం బక్రీద్ అని, ఆ మహమ్మద్ ప్రవక్త అల్లాహ్ ఆశీస్సులు ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండి సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షిం చారు.ఈ కార్యక్రమంలోభద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఉద్యమ బిసీనియర్ నాయకులుసిలివేరి సత్యనారాయణ, ఇల్లందు పట్టణ ఉపాధ్యక్షుడు అబ్దుల్ నబీ, మహమ్మద్ అబ్దుల్ జబ్బార్, ఇల్లందు పట్టణ యువజన నాయకులు గిన్నారపు రాజేష్, సోషల్ మీడియా విభాగం సాత్తాలహరికృష్ణ, కాసాని హరిప్రసాద్ యాదవ్,ఎస్.కె చాంద్ పాషా, ఎస్.కె సర్దార్ పాషా, సయ్యద్ బాబా, ఇల్లందు మండల మాజీ కో ఆప్షన్ సభ్యులు ఘాజి,మూలగుండ్ల ఉపేందర్ రావు,మాజీ కోషన్స్ సభ్యులు రబ్బు,రామ్ లాల్ పాసి,నెమలి నిఖిల్, కొండు రవికాంత్, ఎస్కే ఇమ్రాన్, పాల్గొన్నారు

# జి ఓ నెంబర్ 49 రద్దుకై ఆదివాసీ సంఘాల మాహార్యాలీ

## టైగర్ క్యారిడార్ పేరిట తెచ్చిన జి ఓ 49 రద్దు చేయాలి



**తొలి సమయం కొమురం భీం ఆసిఫా బాద్ జూన్ 7:** కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రములో ఆదివాసి హక్కుల పోరాట సమితి తుడుందేబ్బ అధ్వర్యంలో టైగర్ కారిడార్ పేరిట జీవో నం 49 నీ రద్దు చేయాలనీ కుమ్రం భీం చౌక్ నుంచి అంబేద్కర్ చౌక్, మార్కెట్, మీదుగా కలెక్టరేట్ వరకు భారీగ అడివాసులతో మహ ర్యాలి చేశారు అనంతరం కలెక్టరేట్ ఎదుట ధర్నా చౌక్ ఎదుట రాజ్ గోండ్ సేవ సమితి గొండ్వాన పంచాయితి రాయ్ సెంటర్ అధ్వర్యంలో గత 10 రోజులుగా నిర్వహిస్తున్న రిలే నిరహార దీక్ష లో పాల్గొని సంపూర్ణ సంఘీభావం తెలిపి టైగర్ జోన్ రద్దు చెసే వరకు ఉద్యమాన్ని ఆపేది లేదూ అని అన్నారు... ఈ సంధర్భంగా తుడుందేబ్బ రాష్ట్ర , జిల్లాల నాయకులు, మండలాల నాయకులు , ప్రజ ప్రతినిధులు మాజి ప్రజ ప్రతినిధులు పలువురు మాట్లడుతూ టైగర్ జోన్ రద్దు చేయాల్సిందే అడవి నె నమ్ముకొని అడవి నే దేవునిగా భావిస్తూ అడవి నీ కాపాడుకుంటూ వస్తున్న ఆదివాసిలను ఇబ్బందులకు గురి చేస్తున్నా అటవి శాఖ అధికారులూ, ఇప్పుడూ టైగర్ కారిడార్ పేరిట జీవో నం 49 నూ తీసుకొని రావటం ఇది చాల అన్యాయమని అన్నారు, చాల సందర్భాలలో పోడు భూముల విషయంలో అటవి శాఖ అధికారులు దౌర్జన్యానికి చేసినా ఘటనలు ఇప్పుడూ కూడా ఆ గాయాలు మనలేదని అలాంటిది ఇప్పుడు టైగర్ జోన్ తీసుకొచ్చి ఆదివాసి హక్కులను కాలరాసే విధంగ చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు.... ఎన్నో సందర్భాలలో ఆదివాసులకు అక్రమ కేసుల్లో ఇరికించి అరెస్టులు చేసినా దౌర్జన్యాలు అటవి శాఖ వారూ చేశారని ఇప్పుడూ టైగర్ జోన్ అమలూ చేస్తే ఆనాటి కుంరం భీం పోరాటం చేసినట్టు ఎదురు దాడులకు దిగుతామని తాడో పెడో తేల్చుకుంటామని తెలిపారు, కాబట్టి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఈ విషయంలో ప్రత్యేక శ్రద్ధ చొరవ తీసుకొని టైగర్ జోన్ రద్దు చేయాలని అన్నారు, ఆదివాసి గ్రామాలలో ఇక అటవి శాఖ అధికారులూ వచ్చేదే లేదు ఆని అటవి శాఖ వారిని ఆదివాసి గ్రామాలకూ రాకూడదు అని ఏజెన్సీ ప్రాంతంలో ఏజెన్సీ చట్టాలను తుంగలో తొక్కిన అటవి శాఖ వారికి టైగర్ జోన్ రద్దు చేయాలనీ అల్టిమేటం జారీ అని అన్నారు....అలాగే ఆదివాసి ప్రతి గ్రామంలో అటవి శాఖ కీ తీరుకు వ్యతిరేకంగా టైగర్ జోన్ రద్దు చేయాలనీ నిరసిస్తూ 09-06-2025 సోమవారం రోజున గ్రమ గ్రామాన నల్ల జెండాలు ఎగరువేసి నిరసన తెలపాలని ఆదివాసి సంఘాలు తుడుందేబ్బ రాజ్ గొండ్ సేవ సమితి, గొండ్వనా పంచాయితి రాయ్ సెంటర్ మరియు ఆదివాసి పలు సంఘలు ప్రకటించారు.... ఈ కార్యక్రమంలో వీరితోపాటు రాజ్ గొండ్ సేవా సమితి జాతీయ నాయకులు, సిడం అర్జు మాస్టర్ ఆదివాసి హక్కుల పోరాట సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు బుర్స పోచయ్య, కుమ్రం భీం ఆసిఫాబాద్ తుడుందేబ్బజిల్లా అధ్యక్షులు కోవ విజయ్ కుమార్, అదిలాబాద్ తుడుందేబ్బ జిల్లా అధ్యక్షులు పెందొర్ దాదిరావు, రాజ్ గొండ్ సేవా సమితి జిల్లా అధ్యక్షులు మడవి శ్రీనివాస్, రాష్ట్ర నాయకులు పచ్చుకీ కేశవ్ రావు, మడ వి నర్సింగరావు, పేందూర్ ధర్మ ,విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు మడవి భారత్ భూషణ్, తుడుం దెబ్బ జిల్లా ప్రధాన కార్యదర్శి పెందూర్ మారుతి తుడుం దెబ్బ జిల్లా ఉపాధ్యక్షులు వెడ్మ భగవంత్ రావు, డివిజన్ నాయకులు కనక ప్రభాకర్, కొర్కేట జ్ఞానేశ్వర్, తుంరం సందీప్, మరియు వివిధ సంఘాల నాయకులు ప్రజాప్రతినిధులు మాజీ ప్రజాప్రతినిధులు యువకులు జాతి ప్రజలు పాల్గొన్నారు

# మంత్రి కొండ సురేఖ మురళీధర్ రావు ఆదేశాల మేరకు ఆర్థిక సాయం

## అందజేసిన కాంగ్రెస్ పార్టీ ప్రజా నాయకుడు పగడాల సతీష్



**తొలి సమయం వరంగల్ జూన్ 7** వరంగల్ 34వ డివిజన్ శివనగర్ ప్రాంతానికి చెందిన వేటూరి పారిజాతం దేవంద్ర చారీ ఇంట్లో గురువారం రోజు షార్ట్ సర్క్యూట్ వల్ల దాదాపు 3లక్షల రూపాయల ఆస్తి నష్టం జరిగింది కాగా మంత్రి కొండ సురేఖ మురళీధర్ ఆదేశాల మేరకు వారి ఇంటికి వెళ్లి పరామర్శించి ఆర్థిక సహాయం పగడాల సతీష్ అందజేశారు. అక్షిత్ పటేల్ మధవి, రమేష్ సత్యనారాయణ,అబోజు తిరుపతి తదితరులు పాల్గొనడం జరిగింది.

## తరలిస్తున్న సుమారు 50 గోవులను పట్టుకున్న హిందూ ఐక్యవేదిక నాయకులు



**తొలిసమయం, ఇల్లందు.జూన్, 07.** నిన్న అర్ధరాత్రి స్థానిక స్టేషన్ బస్తీ లోని పెంకు ఫ్యాక్టరీ ప్రాంతం నుండి తరలిస్తున్న సుమారు 50 గోవులను పట్టుకున్న హిందూ ఐక్యవేదిక నాయకులు.నిన్న అర్ధరాత్రి సమాచారం అందుకున్న ఐక్యవేదిక నాయకులు అక్కడకు వెళ్లి చూసి నిర్ధారించుకుని స్థానిక ఎస్.హెచ్. ఓ. బత్తుల సత్యనారాయణ గారికి సమాచారం ఇవ్వగా వెంటనే ఆ ప్రాంతానికి చేరుకున్న సిబ్బంది.అట్టి గోవులను,తరలించడానికి సిద్ధంగా ఉన్న లారీ నీ పట్టుకుని, కేసు నమోదు చేసి పాల్వంచ లోని గో శాలకు తరలించడం జరిగింది.

## త్యాగనిరతికి దాన గుణానికి ప్రతీక బక్రీద్ ఎమ్మెల్యే కోరం కనకయ్య.



**తొలిసమయం, ఇల్లందు.జూన్, 07.** త్యాగనిరతికి దాన గుణానికి ప్రతీక బక్రీద్ పండుగ అని ఇల్లందు నియోజకవర్గ శాసనసభ్యులు కోరం కనకయ్య పేర్కొన్నారు. బక్రీద్ పర్వదినాన్ని పట్టణం పరిధి లోని ఈద్గా వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు, అనంతరం ఒకరినొకరు ఆలింగణం చేసుకుని బక్రీద్ పర్వదిన శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోరం కనకయ్య బక్రీద్ పర్వదిన విశిష్టతను వివరించారు. ప్రార్థనలో కాంగ్రెస్ నాయకులు పాల్గొని, ముస్లిం సోదరులకు బక్రీద్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఎమ్మెల్యే వెంట సిఐ బత్తుల సత్యనారాయణ, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## త్యాగానికి, ప్రేమకు ప్రతిరూపం బక్రీద్ పండుగ మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి

**బక్రీద్ పండుగను పురస్కరించుకొని వరంగల్ నగరంలోని పలు ఈద్గాలలో నిర్వహించిన ప్రార్థనల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి**



**తొలి సమయం వరంగల్ జూన్ 7** మైనార్టీల సంక్షేమానికి, అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం నిబద్ధతతో పనిచేస్తున్నదని మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి అన్నారు.నేడు బక్రీద్ పండుగను పురస్కరించుకుని వరంగల్ నగరంలోని ఎల్బి నగర్, మట్టేవాడ, ఖిలా వరంగల్ ఇదిగాకు వచ్చి ముస్లీం సోదరులకు బక్రీద్ శుభాకాంక్షలు తెలుపడం జరిగింది. అదేవిధంగా కిలా వరంగల్ ఈద్గాకు మరమ్మత్తు పనులకు కోటి రూపాయల విరాళం ఇవ్వడం జరిగింది అదేవిధంగా చింతల్ ఇదిగాకు 40 లక్షల విరాళం ఇవ్వడం జరిగింది.ఈద్గాలలో నిర్వహించిన ప్రార్థనా కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి పాల్గొన్నారు.ఈ సందర్భంగా కొండా మురళిని ముస్లిం మత పెద్దలు శాలువాతో సత్కరించి గౌరవించారు.ఈ కార్యక్రమంలో టవకల్ వెల్ఫేర్ ట్రస్ట్ చైర్మన్ ఎం ఏ జబ్బార్, చాకరేస్కుంటా కమిటీ మెంబర్స్ మహమ్మద్ మద్దూం,హసన్ అలీబేగ్, మొహమ్మద్ చాంద్ పాషా, వక్ఫ్ బోర్డు ఇన్స్పెక్టర్ రియాజ్, మహమ్మద్ అంకుష్, ఇబ్రహీం, దస్తగీర్, మాషూక్, అంజద్,అలీ, తదితరులు పాల్గొనడం జరిగింది.ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి మాట్లాడుతూ, బక్రీద్ అనేది త్యాగానికి ,విశ్వాసానికి అల్లాహ్ కి విధేయతకు ప్రతీక అని కొండా మురళి అన్నారు .తమ కుటుంబ సభ్యుడిగా భావించి తనను ఈద్గా ప్రార్థనా కార్యక్రమాలకు ఆహ్వానించిన ముస్లిం మత పెద్దలకు,ఈద్గా కమిటి సభ్యులకు,ప్రజలకు కొండా మురళి ధన్యవాదాలు తెలిపారు. మైనార్టీలకు దివంగత మాజీ ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి హయాంలో తెచ్చిన రిజర్వేషన్ల వల్ల ఎందరో ముస్లింల జీవితాలు బాగుపడ్డాయని నేడు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో ముస్లిం మైనార్టీల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రజాప్రభుత్వం పునరంకితమైందని చెప్పారు. మైనార్టీల కోసం విద్యా,ఉపాధి, ఆరోగ్య రంగాల్లో అనేక పథకాలు ప్రభుత్వం అమలు చేస్తుందని తెలిపారు.పలు రంగాల్లో ముస్లింలు ఎదుర్కొంటున్న సమస్యలను నేను మంత్రి కొండా సురేఖ కలిసి సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకుపోయి పరిష్కరించేందుకు శాయశక్తులా కృషిచేస్తామని ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి తెలిపారు.

# బక్రీద్ అనేది త్యాగానికి, విశ్వాసానికి, అల్లాహ్‌కి విధేయతకు ప్రతీక

## మైనారిటీల కోసం విద్య, ఉపాధి,ఆరోగ్య రంగాల్లో అనేక పథకాలు అమలు చేస్తున్న ప్రభుత్వం



**తొలి సమయం వరంగల్ జూన్ 7**

రాష్ట్రాన్ని ఐక్యతతో కూడిన అభివృద్ధి రాష్ట్రంగా మార్చే దిశగా నడిపిస్తున్న ప్రజా కాంగ్రెస్ ప్రభుత్వం.పెద్దమ్మగడ్డ ఈద్గా మైదానంలో ప్రార్ధనలో పాల్గొన్న ఎమ్మెల్యే నాయిని,చైర్మన్ సిరిసిల్ల రాజయ్యబక్రీద్ అనేది త్యాగానికి, విశ్వాసానికి, అల్లాహ్‌కి విధేయతకు ప్రతీక అని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు శనివారం రోజున బక్రీద్ పండుగను పురస్కరించుకొని హనుమకొండ లోని పెద్దమ్మగడ్డలోని ఈద్గా లో ప్రత్యేక ప్రార్ధనలు రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీ సిరిసిల్ల రాజయ్యతో కలిసి పాల్గొన్నారు.ముస్లిం సోదరులతో కలిసి ప్రార్ధనలు చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని మాట్లాడుతూ అందరికీ నా హృదయపూర్వక బక్రీద్ శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను.ఈ పవిత్రమైన పర్వదినాన్ని పురస్కరించుకొని ముస్లిం సోదర, సోదరీమణులకు మరియు సమాజంలోని ప్రతి ఒక్కరికి శాంతి,ఆనందం, ఐక్యత కలగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను.బక్రీద్ అనేది త్యాగానికి, విశ్వాసానికి, అల్లాహ్‌కి విధేయతకు ప్రతీక. ప్రవక్త ఇబ్రాహీం (అలైహిస్సలాం) చేసిన త్యాగం మనందరికి నిస్వార్థత,ధైర్యం,భక్తి అనే విలువల్ని గుర్తు చేస్తుంది. ఈ పండుగ సారాంశం మనం పంచుకునే ప్రేమలో, సహనంలో, మానవత్వంలో ఉంటుంది.ఇవాళ మన తెలంగాణ రాష్ట్రం ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి నాయకత్వంలో అన్ని వర్గాల సంక్షేమానికి కట్టుబడి పని చేస్తోంది. ఆయన దృష్టిలో ప్రతి మతస్తుడూ సమానంగా గౌరవించబడతాడు. మైనారిటీల కోసం విద్య,ఉపాధి, ఆరోగ్య రంగాల్లో అనేక పథకాలు తీసుకొచ్చారు.ముస్లిం సోదరులకు కావలసిన మౌలిక వసతులు, మసీదు అభివృద్ధి,గురుకుల పాఠశాలలు,మైనారిటీ కార్పొరేషన్ సహాయాలు ఈ ప్రభుత్వం ప్రాధాన్యతగా చూస్తోంది.తెలంగాణ రాష్ట్రాన్ని ఐక్యతతో కూడిన అభివృద్ధి రాష్ట్రంగా మార్చే దిశగా నడిపిస్తున్నది రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజాస్వామ్య ప్రభుత్వం. మతసామరస్యాన్ని పరిరక్షిస్తూ, ప్రతి పండుగను ప్రతి వర్గంతో కలిసి జరుపుకుంటున్నాం.ఈరోజు మనందరం ఓ సంకల్పం చేసుకుందాం మతాలు వేరు, మనం ఒక్కటే. పండుగలు మన హృదయాలను దగ్గర చేస్తాయి. బక్రీద్ సందర్భంగా పేదలకు, అవసరమైన వారికి తోడుగా నిలుద్దాం. మనం చూపే ప్రేమే అసలైన పండుగ.ఈ పవిత్రమైన బక్రీద్ పండుగ మన రాష్ట్రానికి శాంతిని, ఐక్యతను, అభివృద్ధిని తీసుకురావాలని, ప్రతి ఇంటిలో ఆనందాన్ని నింపాలని కోరుకుంటూ అందరికీ బక్రీద్ శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అంబేద్కర్ రాజు,డివిజన్ అధ్యక్షుడు శ్రీధర్ యాదవ్ మరియు స్థానిక నాయకులు,మత పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# దేవాదుల ప్రాజెక్టు పూర్తి చేసి సాగునీరు అందించాలి

## ఎల్కతుర్తి లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని వంద పడకల హాస్పిటల్ గా ఏర్పాటు చేయాలి

## అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలి సిపిఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి

**తొలి సమయం వరంగల్ జూన్ 7**

ఎల్కతుర్తి : అసంపూర్తిగా ఉన్న దేవాదుల ప్రాజెక్టు పూర్తి చేసి చివరి ఆయకట్టు రైతులకు సాగునీరు అందించాలని సిపిఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి డిమాండ్ చేశారు. ఎల్కతుర్తి మండల కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అసంపూర్తిగా దేవాదుల ప్రాజెక్టును పూర్తి చేసి రైతన్నను ఆదుకోవాలని అనేకసార్లు ఈ ప్రాంత ఎమ్మెల్యేలకు అధికారులకు విన్నవించిన కూడా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. రైతాంగానికి రబీ సీజన్లో చివరి ఆయకట్టుకు నీరు కాల్వల ద్వారా పోవడం లేదని, మధ్యలోనే గండ్లు పడి నీరు వృధాగా పోతున్నదని, వెంటనే ఈ సమస్యను పరిష్కారం చేయాలని కోరారు. మంత్రి పొన్నం ప్రభాకర్,ఘన్ పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి చొరవ చూపి శాశ్వత పరిష్కారం చేయాలని కోరారు. ఉమ్మడి వరంగల్ కరీంనగర్ , మెదక్ జిల్లాలకు సరిహద్దుగా ఉన్న ఎల్కతుర్తి మండల కేంద్రంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని 100 పడకల దవాఖానగా ఏర్పాటుచేసి ప్రమాదాల గురైతే సకాలంలో ఆదుకునేలా తీర్చిదిద్దాలని కోరారు. దూరంగా వరంగల్ ఎంజీఎం ఉండడంవల్ల ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారని, దీనిని గమనించి ఇప్పటికే మంత్రి పొన్నం ప్రభాకర్ కు సిపిఐ కార్యకర్తలు నాయకులు దృష్టికి తీసుకోవడం జరిగిందని, వెంటనే మంత్రి పొన్నంప్రభాకర్ వంద పడగల దాఖాన గా తీర్చిదిద్దుటకు కృషి చేయాలని కోరారు. గత టిఆర్ఎస్ ప్రభుత్వం పది సంవత్సరాలు ప్రభుత్వంలో కొనసాగినా అర్హులైన పేదలకు ఇండ్లు అందక దుర్భర జీవితం గడుపుతున్నా పట్టించుకోవడంలో పూర్తిగా వైఫల్యం చెందారవి, ఈ రాష్ట్ర ప్రభుత్వం కొద్దిమంది వరకే ప్రారంభించినా ఇంకా అర్హులైన వారిని గుర్తించి ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేసి పేదవారిని ఆదుకోవాలని సిపిఐ డిమాండ్ చేస్తుందన్నారు. రేషన్ కార్డు లేక దరఖాస్తులు చేసుకున్న వారికి అందేలా అధికారులు కృషి చేయాలని, ప్రభుత్వం వెంటనే రేషన్ కార్డులు మంజూరు చేసి వారిని ఆదుకోవాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల . కగార్ పేరుతో మావోయిస్టులను ఏరివేస్తామని ఎన్ కౌంటర్ ల ద్వారా చంపడంతో మావోయిస్టులు స్వయంగా శాంతి చర్చలు జరపాలని కోరగా కేంద్ర ప్రభుత్వం ఇప్పటికీ అమలు చేయలేదని, కగార్ వెంటనే ఆపివేసి మావోయిస్టులతో శాంతి చర్చలు జరిపి శాంతిని నెలకొల్పాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దేశ స్వాతంత్రం వచ్చి దశాబ్దాలు గడుస్తున్నా నేటికీ ధనవంతులు ధనవంతులుగా మారిపోతున్నారు పేదవాడు మరింత పేదవాడుగా కొనసాగుతా ఉన్నారని,దారిద్ర దిగవరేఖకు సుమారు 30 శాతం నుండి 40 శాతం వరకు ఉన్నారని, ప్రజలు రెండు పూటలా భోజనం చేయలేని దుస్థితిలో జీవిస్తున్నారని, విద్యా, వైద్యం పూర్తిగా ప్రైవేట్ కార్పొరేట్ రంగంలో



చేతుల్లోకి వెళ్లిపోయిందని, విద్యను వైద్యమును కొనుక్కునే దిశగా దేశంలో పరిస్థితి దాపురించిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలు జాతీయ చేసిన వాటిని లాభాల్లో ఉన్న సంస్థలను కూడా కార్పొరేట్ రంగానికి కట్టబెట్టి కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తూ ప్రజల సంక్షేమాన్ని మరిచిపోయి జాతీయవాదం పేరుతో దేశ పౌరులను విభజించి వారి జీవితాలతో ఆడుకుంటున్నారని, భారత రాజ్యాంగాన్ని అమలు చేసే దిశగా కొనసాగడం లేదని, భారత రాజ్యాంగాన్ని ప్రజాస్వామ్యాన్ని లౌక్యవాదాన్ని కాపాడ కోసం ప్రజలు ఐక్యతను చాటాలని సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి కోరారు. ఈ విలేకరుల సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రాములు, జిల్లా కౌన్సిల్ సభ్యులు మంద్రి శ్రీనివాస్, మండల కార్యదర్శి శనగరపు రాజకుమార్, సహాయ కార్యదర్శి గడ్డం రాజనర్సు, సిపిఐ మండల నాయకుల తండముండయ్య,బొంత మల్లయ్య ఆరేపల్లి చంద్రమౌళి,కర్రె రామస్వామి, మిట్టపల్లి ఆనందం తదితరులు పాల్గొన్నారు.

# టీచర్స్ కాలనీ ప్రవేశ ద్వారం (ఆర్చ్) నిర్మాణానికి భూమిపూజ

## కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే నాయిని వరంగల్ పశ్చిమ నియోజకవర్గం.



**తొలి సమయం వరంగల్ జూన్ 7**

వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని 60 వ డివిజన్ వడ్డేపల్లి టీచర్స్ కాలనీలో ఫేస్-2 లో స్థానిక కాలనీవాసుల ఆధ్వర్యంలో నిర్వహించిన కాలనీ ప్రవేశ ద్వారం (అర్చ్) నిర్మాణ భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి.ప్రత్యేక పూజలు చేసి ఎమ్మెల్యే పనులను ప్రారంభించారు .అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ రోజు మీరు చేస్తున్న ఈ కార్యక్రమం చిన్న విషయం కాదని ఇది మీ కాలనీకి ఒక గుర్తింపు, ఒక గౌరవ సూచకంగా,ఒక అభివృద్ధి చిహ్నంగా, పరిగణించబడు తుందని ,ఒక్క ప్రవేశ ద్వారం కడతాం అనగానే అందులో ఎన్నో భావాలు, ఆశలు, కలలు నిండి ఉంటాయన్నారు. అర్చ్ అనేది కేవలం ఒక నిర్మాణం మాత్రమే కాదని అది మీ కాలనీ ఐక్యతకు,అభివృద్ధి దిశగా వేసే తొలి అడుగని కొనియాడారు.ఈ కార్యక్రమం వీలయ్యేలా సహకరించిన కాలనీ వాసులకు, కార్యదర్శులకు, యువతకు మరియు స్థానిక నాయకులకు ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని అభినందనలు తెలియజేశారు.నేను ఎమ్మెల్యేగా పనిచేస్తున్న రోజులన్నీ ప్రజల అవసరాలు, అభివృద్ధి పనులు చేస్తూ ముందుకు నడుస్తానని. ఇదే ఆదర్శంతో, ప్రతి కాలనీకి మౌలిక వసతులు, రహదారులు, స్ట్రీట్ లైట్లు, డ్రైనేజ్ వ్యవస్థ అన్నీ మెరుగుపర్చే దిశగా కృషి చేస్తానని తెలిపారు.ఈ అర్చ్ నిర్మాణం కాలనీ అభివృద్ధికి మరింత వెలుగు తీసుకొచ్చేలా మారాలని ఆకాంక్షించారు. అనంతరం స్థానికంగా ఉన్న అభయాంజనేయ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేసి స్వామి వార్లను దర్శించుకు న్నారు.ఆలయ అర్చకులు, పాలక మండలి సభ్యులు,కాలనీ వాసులు ఎమ్మె ల్యేని సత్కరించారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతి నిధులు, నాయకులు, అధికారులు, ప్రజలు ఉన్నారు.

# ఆపిల్ ప్లే స్కూల్ ప్రారంభం

### ఇందిరమ్మ ఇల్లు నిర్మాణానికి శంకుస్థాపన

### కాజీపేట 47వ డివిజన్ బాపూజీ నగర్

**తొలి సమయం వరంగల్ జూన్ 7**

కాజీపేట 47వ డివిజన్ బాపూజీ నగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ఆపిల్ ప్లే స్కూల్ (చిన్నారుల అభివృద్ధికి అంకితమైన ఆధునిక శైలిలో తయారైన ప్లే స్కూల్) ప్రారంభోత్సవం శనివారం రోజున ఘనంగా జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి అల్లుడు విష్ణు జ్యోతి ప్రజ్వలన చేసి పాఠశాల కార్యకలాపాలకు శ్రీకారం చుట్టారు.ఈ సందర్భంగా విష్ణు మాట్లాడుతూ, “పిల్లల మౌలిక విద్యాభ్యాసానికి బలమైన పునాది వేయడమే ఈ తరహా ప్లే స్కూళ్ల ఉద్దేశ్యం. పిల్లలకు ఆడుతూ పాడుతూ నేర్చుకునే వాతావరణం కల్పించడం అభినందనీయం అని అన్నారు.ఇందిరమ్మ ఇల్లు మంజూరు – నిర్మాణానికి శ్రీకారంతరువాత అదే డివిజన్‌కి చెందిన ఎమ్మెల్యే నాయి నాయిని రాజేందర్ రెడ్డి అభిమాని ,ఇల్లులేని స్థితిలో ఏళ్లుగా ఉంటున్న పేర్ల సంతోష్ కుమార్ కి ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అందించిన ఇందిరమ్మ ఇల్లు మంజూరు పత్రాన్ని శ్రీ విష్ణు చేతుల మీదుగా స్వీకరించారు. శుభ ముహూర్తాన్ని పురస్కరించుకుని వారు తమ స్వగృహ నిర్మాణానికి ముగ్గు వేసి శంకుస్థాపన చేశారు.నాడు ఎన్నికల ముందు ఇళ్లు



ఇస్తానని మాట ఇచ్చిన నాయిని నేడు ఇళ్లు నిర్మాణ పనులకు నాయిని రాజేందర్ రెడ్డి అల్లుడు విష్ణు వెళ్లడం వారు సంతోషాన్ని వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమాలలో కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్,స్థానిక డివిజన్ అధ్యక్షులు షేక్ అజ్గర్,నాయకులు ఇప్ప శ్రీకాంత్,సిరిల్ లారెన్స్,దొంగల కుమార్ యాదవ్,ఎండీ బిలాల్ (బబ్లూ),తమ్మడి మధు,దువ్వ రాజులు,చిలువేరు విజయ్ భాస్కర్,జనపట్ల నికుంజన్ ,వెంకట్,దార్ల రాజ్ కుమార్,బిడారి రాజేందర్ స్థానిక నాయకులు, తల్లిదండ్రులు, విద్యార్థులు, ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# విద్యార్థుల బంగారు భవిష్యత్తు ప్రభుత్వ పాఠశాలలోనే తీర్చిదిద్దడం జరుగుతుంది

### విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్చాలి హెచ్ఎం ధనసరి నాగమణి.



**తొలిసమయం, ఇల్లందు.జూన్, 07.**

తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్చాలని, ప్రభుత్వ గిరిజన ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాల బొజ్జాయిగూడెం ప్రధానోపాధ్యాయురాలు ధనసరి నాగమణి కోరారు. ఈ మేరకు శుక్రవారం పాఠశాలలో, ఉపాధ్యాయులతో సమావేశమైన ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో అనుభవ విజ్ఞులైన ఉపాధ్యాయులు ఉంటారని, ప్రభుత్వం అన్ని రకాల సదుపాయాలు విద్యార్థులకు కల్పిస్తుందని చెప్పారు. తమ పిల్లల బంగారు భవిష్యత్తు ప్రభుత్వ పాఠశాలలోనే తీర్చిదిద్దడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వం పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్, యూనిఫామ్ విద్యార్థులకు కావలసిన అన్నిరకాల సదుపాయాలు కల్పిస్తుందని వివరించారు.జూన్ 12వ తేదీ న విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోటు బుక్స్, యూనిఫామ్స్ పంపిణీ చేస్తుందని వివరించారు. కావున తల్లిదండ్రులు తమ పిల్లల బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలంటే ప్రభుత్వ పాఠశాలలోనే చేర్చాలని కోరారు.

# మిల్స్ కాలనీ ఇన్స్పెక్టర్ గా బాధ్యతలు చేపట్టిన బొల్లం రమేష్

**తొలి సమయం వరంగల్ జూన్ 7**



వరంగల్ మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ ఇన్స్ స్పెక్టర్ ఆఫ్ పోలీస్ గా బొల్లం రమేష్ ను నియమిస్తూ వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేయగా శనివారం ఆయన వరంగల్ ఏసిపి నందిరాం నాయక్ ను మర్యాద పూర్వక కలిసిన అనంతరం మిల్స్ కాలనీ ఇన్స్పెక్టర్ గా బాధ్యతలు చేపట్టారు.

# బక్రీద్ పండుగ సందర్భంగా ఉర్సు దర్గా పీఠాధిపతి ఆతిథ్యాన్ని స్వీకరించిన మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి

**తొలి సమయం వరంగల్ జూన్ 7**



బక్రీద్ పండుగ పురస్కరించుకొని మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి ఉర్సు దర్గా పీఠాధిపతి ఉబేద్ బాబా నివాసంలో ఆతిథ్యాన్ని స్వీకరించారు. ఉర్సు దర్గా పీఠాధిపతి ఉబేద్ బాబా, వారి సోదరులు నవీద్ బాబా, ఇతర కుటుంబ సభ్యులకు మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా బక్రీద్ ప్రత్యేక వంటకమైన షీర్ ఖుర్మాను కొండా మురళి స్వీకరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మహమ్మద్ అమీర్,సయ్యద్ వసీమ్,మొహమ్మద్ సాదిక్, తదితరులు పాల్గొన్నారు.

# మిల్స్ కాలనీ నూతన సర్కిల్ ఇన్స్పెక్టర్ ను కలసి బొకే అందజేసిన దళిత సంఘం అధ్యక్షులు మరియు సిపిఐ అధ్యక్షులు

**తొలి సమయం వరంగల్ జూన్ 7**





ఈరోజు మిల్స్ కాలనీ నూతన సర్కిల్-ఇన్స్పెక్టర్ బొల్లం రమేష్ ని మర్యాద పూర్వకంగా కలసి బొకే అందజేసి శుభాకాంక్షలు తెలియ జేసిన దళిత హక్కుల పోరాట సమితి వరంగల్ జిల్లా అధ్యక్షులు దళిత రత్న సంఘీ ఎలేందర్ మరియు సీపీఐ నాయకులు బెజ్జంకి యాకంబ్ర చారి మరియు దళిత హక్కుల పోరాట సమితి ఖిలా వరంగల్ మండల కార్యదర్శి రాచర్ల రాజేందర్ మరియు దళిత హక్కుల పోరాట సమితి వరంగల్ జిల్లా ముఖ్య నాయకులు మంద నవీన్,ఠాకూర్ సునీత, వేల్పుకొండ నర్సింగరావు, చింతకింది జానకమ్మ తదితరులు పాల్గొనడం జరిగింది.

# ఎన్ హెచ్ ఆర్ సి. మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులుగా దాసరి ఆదినారాయణ

### జిల్లా ప్రధాన కార్యదర్శిగా తాడబోయిన మహేందర్ యాదవ్ ఎంపిక..

### నియమించిన రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ మొగుళ్ళ భద్రయ్య





మహబూబాబాద్ టౌన్: జాతీయ మానవ హక్కుల కమిటీ (ఎన్ హెచ్ ఆర్ సి) మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులుగా సిరోల్ మండలానికి చెందిన దాసరి ఆదినారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శిగా కురవి మండలానికి చెందిన తాడబోయిన మహేందర్ యాదవ్ ను నియమించారని రాష్ట్ర కమిటీ సభ్యులు గంట హరీష్ కుమార్ తెలిపారు. ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా ఉంటూ బలమైన లీగల్ ప్రొసీజర్, ప్రోటోకాల్ సిస్టంతో ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకు సాగుతున్న ఎన్ హెచ్ ఆర్ సి. రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు పని చేయాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా మానుకోట జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా నియామకమైన దాసరి ఆదినారాయణ, తాడబోయిన మహేందర్ యాదవ్ మాట్లాడుతూ తమపై ఎంతో నమ్మకంతో పదవిని అప్పజెప్పిన రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ మొగుళ్ళ భద్రయ్య సార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు తోట రాజయ్య పాముల నారాయణ, రాష్ట్ర కమిటీ సభ్యులు గంట హరీష్ కుమార్ తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు. అవినీతి అక్రమాలకు తావులేని సమాజం కోసం కృషి చేస్తామని స్పష్టం చేశారు. జిల్లాలోని అన్ని కమిటీలను పూర్తిచేస్తామని వారు పేర్కొన్నారు. వీరి నియామకంతో మహబూబాబాద్ జిల్లాలోని మేధావులు, విద్యావంతులు, సామాజిక ఉద్యమకారులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందిస్తున్నారు.

# పీఆర్సీని వెంటనే అమలుచేయాలి

- ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీచేయాలి
- మ్యానిఫెస్టో లోని హామీలను అమలు చేయాలి - టీఎస్ యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావ రవి



**చర్ల, జూన్ 07 :** శనివారం సాయంత్రం చర్ల లో రాంబాబు అధ్యక్షతన జరిగిన టిఎస్ యుటిఎఫ్ మండల కమిటీ సమావేశంలో చావ రవి మఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. 2023 అసెంబ్లీ ఎన్నికల నాటికి బకాయి పడిన మూడు వాయిదాల డిఎ ను పదిహేను రోజుల్లో విడుదల చేస్తామని ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించినప్పటికీ అధికారంలోకి వచ్చి 18 నెలలు గడుస్తున్నా హామీని నిలుపుకోలేక పోయిందని విమర్శించారు. ఉద్యోగుల ఆరోగ్య పథకాన్ని అన్ని యాజమాన్యాల ఉద్యోగులకు వర్తింపజేయాలని, పీఆర్సీ ఇప్పటికే 23 నెలలు ఆలస్యమైనందున వెంటనే నివేదిక తెప్పించుకుని అమలు చేయాలని డిమాండ్ చేశారు.విద్యా శాఖలో పర్యవేక్షణ అధికారులు డిఈఒ, డిప్యూటీ ఇఒ, ఎంఈఒ పోస్టులను శాశ్వత ప్రాతిపదికన నియమించాలని కోరారు. వేసవి సెలవులు ముగిసేలోగా ఖాళీగా ఉన్న 700 హైస్కూలు ప్రధానోపాధ్యాయుల పోస్టులకు, ఇంకా స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు పదోన్నతులు ఇవ్వాలని రవి డిమాండ్ చేశారు.రాష్ట్ర కార్యదర్శి బి రాజు మాట్లాడుతూ బడిబాట ముగిసేవరకు ఉపాధ్యాయుల సర్దుబాటు ను వాయిదా వేయాలని, మెమో 1267 ను సవరించాలని డిమాండ్ చేశారు. టిఎస్ యుటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు బి మురళీ మోహన్ మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలల్లో పూర్వ ప్రాథమిక తరగతులను ప్రారంభించాలని, తరగతికొక ఉపాధ్యాయుడిని నియమించాలని డిమాండ్ చేశారు.ఈ సమావేశం లో టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర కమిటీ సభ్యులు నంది కృష్ణ, జిల్లా కార్యదర్శి సోడె విజయ్ కుమార్, గిరిజన సంక్షేమ విభాగం కన్వీనర్ తేజావత్ బాలు, మండల ప్రధాన కార్యదర్శి ఉయిక బాలకృష్ణ, శ్యామల,సావిత్రి, యం. యాడమరాజు, హిమగిరిబాబు తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

# హెూంమంత్రి అమితాషాని కలిసిన ఛత్తీస్గఢ్ సిఎం



**చర్ల, జూన్ 07 :** తెలంగాణ సరిహద్దు రాష్ట్రమైన ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయి శుక్రవారం న్యూఢిల్లీలో కేంద్ర హెూంమంత్రి అమిత్ షాను కలిశారు. ఈ సందర్భంగా, రాష్ట్రంలో మావోయిస్టు వ్యతిరేక కార్యకలాపాలలో ఇప్పటివరకు సాధించిన విజయాలు, బస్తర్ ప్రాంతంలో జరుగుతున్న అభివృద్ధి పనుల గురించి ముఖ్యమంత్రి వివరణాత్మక సమాచారాన్ని అందించారు. రాష్ట్ర ప్రభుత్వ కొత్త వ్యూహం, కేంద్రం మద్దతుతో నక్సల్ నిర్మూలన ప్రచారం నిర్ణయాత్మక దశకు చేరుకుందని ముఖ్యమంత్రి అన్నారు. గత ఒకటిన్నర సంవత్సరాలలో నిర్వహించిన తీవ్ర ప్రచారాలు సానుకూల ఫలితాలను ఇచ్చాయి. 1,428 మంది మావోయిస్టులు లొంగిపోయారని, ఇది గత ఐదేళ్లతో పోలిస్తే గణనీయమైన పెరుగుదల అని ముఖ్యమంత్రి అన్నారు. 205 ఎన్‌కౌంటర్లలో 427 మంది మావోయిస్టులు మరణించారని ముఖ్యమంత్రి శ్రీ సాయి తెలియ జేశారు, వారిలో సంస్థ అగ్ర నాయకుడు జనరల్ సెక్రటరీ బసవ రాజు, కేంద్ర కమిటీ సభ్యుడు సుధాకర్ వంటి అపఖ్యాతి పాలైన మావోయిస్టులు ఉన్నారు. దీనితో పాటు, రాష్ట్రంలో 64 కొత్త ఫార్వర్డ్ సెక్యూరిటీ శిబిరాలను ఏర్పాటు చేశారు, ఇది భద్రతా నెట్‌వర్క్‌ను బలోపేతం చేసింది. ఈ భద్రతా శిబిరాల చుట్టూ ఉన్న గ్రామాలకు విద్యుత్, తాగునీరు, ఆరోగ్య సేవలు మరియు పాఠశాలలు వంటి ప్రాథమిక సౌకర్యాలు ఇప్పుడు వేగంగా అందించబడుతున్నాయని ఆయన తెలియజేశారు. 'నియాద్ నెల్లనార్ పథకం' కింద గుర్తించబడిన 146 గ్రామాల్లో 18 రకాల కమ్యూనిటీ సేవలు మరియు 25 రకాల ప్రభుత్వ పథకాలు సమగ్ర పద్ధతిలో అమలు చేయబడుతున్నాయి, ఇది ప్రభుత్వ వ్యవస్థపై స్థానిక ప్రజలకు నమ్మకాన్ని పెంచింది.ముఖ్యమంత్రి సాయి సమర్పించిన ప్రగతి నివేదికను హెూం మంత్రి అమిత్ షా ప్రశంసించారు. ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వ ప్రయత్నాల కారణంగా మావోయిస్టు కార్యకలాపాలపై నిర్ణయాత్మక నియంత్రణ సాధ్యమవుతోందని, కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి అన్ని విధాలుగా సహాయం అందిస్తూనే ఉంటుందని అన్నారు.

# ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలి

### మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలి : సిపిఎం పార్టీ డిమాండ్




**చర్ల, జూన్ 07 :** చర్లలో శనివారం బిఎస్ రామయ్య భవన్ నందు కారం నరేష్ అధ్యక్షతన జరిగిన పార్టీ మండల కమిటీ సమావేశంలో మచ్చ వెంకటేశ్వర్లు పాల్గొని మాట్లాడారు. భారతదేశంలోని ఏజెన్సీ ప్రాంతంలో విస్తారమైన ఖనిజ సంపద ,జల వనరులు, ప్రకృతి వనరులు ఉన్నాయని వాటన్నింటినీ కార్పొరేట్ కంపెనీలకు దోచిపెట్టడం కోసమే కేంద్ర ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నిస్తుందని విమర్శించారు. అటవీ ప్రాంతంలోని ఆదివాసీ ప్రజలను వెళ్లగొట్టడానికి నిశ్చయించుకున్న కేంద్ర ప్రభుత్వం మావోయిస్టులను సాకుగా చూపి ఆపరేషన్ కగార్ పేరుతో నరమేధం సాగిస్తున్నారని పేర్కొన్నారు. వ్యక్తిగత హింస వాదానికి సిపిఎం పార్టీ వ్యతిరేకమని పేర్కొన్నారు. మావోయిస్టులు సైతం శాంతి చర్చలు జరిపేందుకు ఆయుధాలు సైతం విడిచిపెడతామని బహిరంగ ప్రకటించినప్పటికీ కేంద్ర ప్రభుత్వం ఎందుకు చర్చలు జరపటం లేదని ప్రశ్నించారు . దేశ సరిహద్దుల్లో ఉన్న ఉగ్రవాద సంస్థలతోటి చర్చలు జరపటానికి సిద్ధపడుతున్న కేంద్ర ప్రభుత్వం దేశంలో లోపల ఉన్న అంతర్గత సమస్యను పరిష్కారం చేయడం కోసం మావోయిస్టుల తోటి చర్చలుజరపాలని సిపియం డిమాండ్ చేసింది. వర్షాకాలం ప్రారంభమవుతున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రభలే అవకాశం ఉందని పి హెచ్చ్ లు, సబ్ సెంటర్ స్థాయిలో మందులు వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలని సిపిఎం పార్టీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. చర్ల మండల కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ సిహెచ్సి ని పూర్తిస్థాయి వినియోగంలోకి తీసుకురావాలని అందుకు అవసరమైన డాక్టర్లను వైద్య సిబ్బందిని నియమించాలని సిపిఎం డిమాండ్ చేసింది. మండల కమిటీ సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కే బ్రహ్మాచారి, రేపాకుల శ్రీనివాస్, మండల కార్యదర్శి మచ్చ రామారావు, మండల కమిటీ సభ్యులు పొడుపు గంటి సమ్మక్క,తాటి నాగమణి,బందెల చంటి, దొడ్డి హరినాథ వర్మ,పామారు బాలాజీ,నవీన్,వరలక్ష్మి, శ్యామల, చంద్రం తదితరులు పాల్గొన్నారు.

## ఏఐజీ హాస్పిటల్‌లో అగ్నిప్రమాదం..

**హైదరాబాద్, జూన్ 7:** నగరంలోని గచ్చిబౌలి ఏఐజీ హాస్పిటల్ గ్రౌండ్ ఫ్లోర్‌లో శనివారం స్వల్ప అగ్ని ప్రమాదం సంభవించింది. అత్యవసర విభాగం వద్ద పార్కింగ్ చేసిన అంబులెన్స్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. వాహనం నుంచి బయటకు పొగలు వ్యాపించాయి. మంటలు వ్యాపించడంతో రోగులు, రోగుల బంధువులు భయాందోళనకు గురై అక్కడి నుంచి బయటకు పరుగులు తీశారు. మంటలను గుర్తించిన ఆస్పత్రి సిబ్బంది వెంటనే ఫైర్ సిబ్బందికి సమాచారం అందజేశారు. అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన అక్కడకు చేరుకుని రెండు ఫైర్ ఇంజన్లతో మంటలను అదుపు చేశారు.

## గడ్డి మందు తాగి చనిపోయిన యువకుని కుటుంబాన్ని పరామర్శించిన జెఎస్ఆర్



**ఎల్కతుర్తి, జూన్ 07**

మండల కేంద్రంలో ని గుంటూరుపల్లి గ్రామానికి చెందిన నెట్టం సతీష్ 01.06.2025 రోజునా గడ్డి మందు తాగి మృతి చెందిన విషయం తెలుసుకున్న వృక్ష ప్రసాద దాత జాన్నపు రెడ్డి సురేందర్ రెడ్డి మృతి చెందిన సతీష్ తల్లి తండ్రులయినా వెంకటేశ్వర్లు (బుల్లి) మంజుల ను పరామర్శించారు. వారి కుటుంబానికి మనోధైర్యం ఇవ్వాలని హ భగవంతుణ్ణి కోరినట్టు తెలిపారు. వారి కుటుంబానికి అన్ని వేళలా అండగా వుంటామని తెలిపారు. పరామర్శించిన వారిలో బిజెపి మండల పార్టీ మాజీ అధ్యక్షులు కూడుతడి చిరంజీవి, మండలం మాజీ సర్పంచుల ఫోరమ్ అధ్యక్షులు బూరుగుల రామ రావు, డా. దేవేందర్ రెడ్డి, కోరే పున్నం చందర్, నాంపల్లి అశోక్, కడారి కిరణ్,తదితరులు పాల్గొన్నారు.

## మహిళా ఎస్సై పై చేయి చేసుకున్న కాంగ్రెస్ నేత..



**ఖమ్మం:** ఖమ్మం జిల్లా కల్లూరులో శుక్రవారం రాత్రి షాకింగ్ ఘటన చోటుచేసుకుంది. కల్లూరు చౌదరి హెూటల్ వద్ద అర్ధరాత్రి సమయంలో విధుల్లో ఉన్న ఎస్ఐ హరితపై కాంగ్రెస్ నేత రాము దాడికి పాల్పడ్డాడు. హెూటల్ సిబ్బందితో గొడవ పడుతున్న రాము, అతడి అనుచరులను వారించేందుకు లేడీ ఎస్సై వెళ్లారు. ఈ వాగ్వాదం సందర్భంగా ఎస్సై మాట వినకపోగా ఆమెపైన కూడా దాడికి పాల్పడ్డారు. విధుల్లో ఉన్న మహిళా పోలీసుపై ఖమ్మం జిల్లా కాంగ్రెస్ నేత దాడికి తెగబడిన ఘటన సంచలనం రేపుతోంది. కల్లూరు పట్టణంలో శుక్రవారం రాత్రి జరిగిన ఈ షాకింగ్ ఘటన చోటుచేసుకుంది. కల్లూరు ఎన్ఎస్పీ సెంటర్ వద్ద అర్ధరాత్రి సమయంలో కాంగ్రెస్ నేత రాము హెూటల్ సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. ఘర్షణ ముదరడంతో స్నేహితులకు కాల్ చేసి పిలిపించాడు. అందరూ కలిసి హెూటల్ సిబ్బందిపై దాడికి పాల్పడ్డారు. దీంతో హెూటల్ యజమాని పోలీసులకు ఫోన్ చేశారు. సమాచారం అందిన వెంటనే లేడీ ఎస్సై హరిత ఘర్షణ జరుగుతున్న చోటుకి వెళ్లారు. గొడవ పడుతున్న కాంగ్రెస్ నేత, అతడి అనుచరులకు సర్ది చెప్పే ప్రయత్నం చేశారు. ఆమెతో పాటు చుట్టుపక్కల వారు కూడా నచ్చజెప్పారు. గొడవ ఆపేసి శాంతించాలని చెప్పారు. అయినా, రాము, అతడి అనుచరులు ఎవరి మాటలు వినిపించుకోలేదు. ఏకంగా ఎస్సై పైనే తిరిగి దాడి చేసి నెట్టివేశారు. మహిళ అని కూడా చూడకుండా ఎస్సై హరిత భుజంపై చేయి వేసి బలంగా తోసేశాడు. దీంతో ఒక్కసారిగా అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. విధుల్లో ఉన్న మహిళా ఎస్సై పై అనుచితంగా ప్రవర్తించిన తల్లాడ మండలానికి చెందిన రాము, అతడి స్నేహితులు ఆరుగురిని పోలీసులు అరెస్టు చేశారు. కనీసం మర్యాద లేకుండా మహిళా ఎస్సై పైనే ఇలా దౌర్జన్యంగా చేయి చేసుకోవడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం ఈ ఘర్షణకు సంబంధించిన వీడియో నెట్టింట హల్‌చల్ చేస్తోంది.

## వికటించిన సిరప్.. చిన్నారి మృతి

**మెదక్, జూన్ 7:** జిల్లాలోని అల్లాదుర్గం మండల కేంద్రంలోని బుడగ జంగం కాలనీలో విషాదం చోటు చేసుకుంది. సిరప్ వికటించి ఐదుగురు చిన్నారులు ఆస్పత్రిపాలవ్వగా అందులో ఒక చిన్నారి మృతి చెందడం కలకలం రేపింది. బుడగజంగం కాలనీలో నివాసముంటున్న సాయమ్మ దంపతులకు ఐదుగురు సంతానం. కూలీనాలీ చేసుకుని జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో ఐదుగురు చిన్నారులు అనారోగ్యానికి గురయ్యారు. జ్వరం, జలుబు సమస్యతో రేణుక, శ్రీను, ఐశ్వర్య, ప్రియ, గణేష్ అనే చిన్నారులు బాధపడుతున్నారు. దీంతో వారికి మందులు వేయాలని తల్లి భావించింది. వెంటనే అల్లాదుర్గం పీహెచ్‌సీ నుంచి నెల క్రితం తీసుకువచ్చిన సిరప్‌లను చిన్నారులకు తల్లి సాయమ్మ తాగించింది. దగ్గు మందు సేవించిన కొద్దిసేపటికే ఐదుగురు చిన్నారులు అస్వస్థతకు గురయ్యారు. ఇది గమనించిన తల్లిదండ్రులు.. వెంటనే చిన్నారులను జోగిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో ఐదు మంది చిన్నారుల్లో మూడో సంతానమైన ప్రియ మృతి చెందింది. దీంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ప్రస్తుతం జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రిలో ఐశ్వర్య, శ్రీను చికిత్స పొందుతూ కోలుకున్నారు. సిరప్ వేసిన తర్వాత తమ చిన్నారి మృతి చెందిందని తల్లిదండ్రులు చెబుతుండగా.. చిన్నారి చనిపోయింది సిరప్ వల్ల కాదని.. సిరప్ వాడటానికి ఇంకా సమయం ఉందని వైద్యులు తెలిపారు. ఈ ఘటనపై అల్లాదుర్గం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. చిన్నారి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం నివేదిక వచ్చిన తర్వాత చిన్నారి ఎలా చనిపోయింది అనే దానిపై స్పష్టం వచ్చే అవకాశం ఉందని పోలీసులు తెలిపారు.

TEL TEL RNI NO 12283 VEMULA AYODHYA RAMULU TOLI PODDU PUBLICATIONS AND PRINTERS GRAPHICS
H-NO 1-6-155/43/45/4 NANDI NAGAR POST:MANDAL DIST: MAHABUBABAD TELANGANA STATE INDIA PIN CODE 506 101